# జడ్డూ జాదూగర్



పంజాబ్‌పై బదులు తీర్చుకున్న చెన్నై

ప్లేఆఫ్స్ రేసులో సీఎస్‌కే ముందడుగు

ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన జడేజా

**చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా బ్యాట్‌తో పాటు బంతితోనూ అదరగొట్టడంతో ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సాధికారిక విజయం సాధించింది. స్పిన్నర్లకు అనుకూలించిన ధర్మశాల పిచ్‌పై జడ్డూ తన అనుభవాన్ని రంగరించి సీఎస్‌కేను మళ్లీ విజయాల బాట పట్టించాడు. ఈ గెలుపుతో ఆరు రోజుల క్రితం తమను చెపాక్‌లో ఓడించిన పంజాబ్‌పై చెన్నై బదులు తీర్చుకున్నట్టైంది. ఈ సీజన్‌లో ఆరో విజయంతో చెన్నై మళ్లీ టాప్-4లోకి వచ్చి ప్లేఆఫ్స్ రేసులో ముందంజ వేసింది.**

ధర్మశాల: ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో చెన్నై బ్యాటింగ్‌లో విఫలమైనా బౌలింగ్‌లో అదరగొట్టి తమ ఖాతాలో మరో విజయాన్ని నమోదు చేసింది. ధర్మశాల వేదికగా ఆదివారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టును 28 పరుగుల తేడాతో ఓడించింది. చెన్నై నిర్దేశించిన 168 పరుగుల ఛేదనలో పంజాబ్.. 20 ఓవర్లలో 139/9 పరుగుల వద్దే ఆగిపోయింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (23 బంతుల్లో 30, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' రవీంద్ర జడేజా (3/20) స్పిన్ మాయాజాలానికి తోడు తుషార్ దేశ్‌పాండే (2/35), సిమర్‌జిత్ సింగ్ (2/16) పేస్‌కు పంజాబ్ కుదేలైంది. మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 167/9 పరుగులకే పరిమితమైంది. బంతితో రాణించిన జడ్డూ బ్యాట్ (26 బంతుల్లో 43, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) తోనూ మెరిశాడు.

రవీంద్ర జడేజా (43, 3/23)

**తడబడ్డ చెన్నై**

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై ఆరంభంలో ధాటిగానే ఆడినా తర్వాత తడబడింది. రహానే (9) మరోసారి నిరాశపరచగా కెప్టెన్ రుతురాజ్ (32), డారిల్ మిచెల్ (30) పవర్ ప్లేలో వేగంగా ఆడారు. కానీ రాహుల్ చాహర్ ఒకే ఓవర్లో రుతురాజ్, దూబేలను ఔట్ చేసి చెన్నైకి షాకిచ్చాడు. మోయిన్ అలీ (17), శాంట్నర్ (11), శార్దూల్ (11) విఫలమవగా ధోనీ డకౌట్ అయ్యాడు. వరుసగా వికెట్లు కోల్పోతున్నా ఆఖర్లో జడ్డూ మెరుపులతో చెన్నై ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది.

**పసలేని పంజాబ్ బ్యాటింగ్**

ఛేదనలో పంజాబ్ ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. రెండో ఓవర్లోనే జానీ బెయిర్ స్టో (7), రిలీ రూసో(0) తమ వికెట్లను తుషార్‌కు సమర్పించుకున్నారు. ప్రభ్‌సిమ్రన్, శశాంక్ సింగ్ (27) కొంతసేపు చెన్నై బౌలర్లను ధాటిగా ఎదుర్కొన్నా జడేజా రాకతో ఆ జట్టు పతనం వేగంగా సాగింది. జడ్డూ 9వ ఓవర్లో ప్రభ్‌సిమ్రన్‌ను పెవిలియన్ చేరగా జితేశ్ శర్మను సిమర్‌జిత్ ఔట్ చేశాడు. 13వ ఓవర్లో పంజాబ్ కెప్టెన్ సామ్ కరన్ (7), అశుతోష్ (3)లను ఔట్ చేసి ఆ జట్టును కోలుకోలేని దెబ్బతీశాడు.చాహర్ (16), బ్రర్ (17 నాటౌట్) మెరుపులు మెరిపించి పంజాబ్ ఓటమి అంతరాన్ని తగ్గించారు.

**సంక్షిప్త స్కోర్లు**

**చెన్నై:** 20 ఓవర్లలో 167/9 (జడేజా 43, రుతురాజ్ 32, చాహర్ 3/23, హర్షల్ 3/24).. **పంజాబ్:** 20 ఓవర్లలో 139/9 (ప్రభ్‌సిమ్రన్ 30, శశాంక్ 27, జడేజా 3/20, సిమర్‌జిత్ 2/16)

## పునియాకు షాకిచ్చిన 'నాడా'

**డోపింగ్ శాంపిల్ ఇవ్వనందుకు సస్పెన్షన్ వేటు.. ఒలింపిక్స్ బెర్తుపై సందిగ్ధత!**



ఢిల్లీ: ప్రముఖ రెజ్లర్ బజరంగ్ పునియాకు నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా) షాకిచ్చింది. డోపింగ్ పరీక్షకు శాంపిల్ ఇవ్వని కారణంగా ఆదివారం అతడిపై సస్పెన్షన్ వేటు వేసింది. ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌కు ముందు మార్చి 10న నాడా.. పునియా మూత్ర నమూనాలను కోరింది. కానీ అందుకు పునియా నిరాకరించడంతో అతడిపై క్రమశిక్షణ చర్యలకు దిగింది. తదుపరి నిర్ణయం వెలువడేదాకా అతడు ఏ ఈవెంట్లలో పాల్గొనకుండా సస్పెండ్ చేస్తున్నట్టు నాడా తెలిపింది. ఈనెల 7 వరకు స్పందించాలని పునియాకు అల్టిమేటం జారీ చేసింది. దీనిపై పునియా ఎక్స్ (ట్విటర్) వేదికగా స్పందిస్తూ.. 'నేను డోప్ టెస్టుకు శాంపిల్ ఇచ్చేందుకు ఎప్పుడూ నిరాకరించలేదు. కానీ ఆ పరీక్షకు వాడుతున్న కిట్లు గడువు ముగిశాయి. ముందు వాటిపై ఏ చర్యలు తీసుకున్నారో చెప్పాలని కోరాను. ఆ తర్వాత నన్ను పరీక్షించమని విజ్ఞప్తి చేశా. దీనిపై మా న్యాయవాది త్వరలోనే సమాధానమిస్తారు' అని వివరణ ఇచ్చాడు. నాడా సస్పెన్షన్ నేపథ్యంలో పునియా ఒలింపిక్స్‌కు బరిలో దిగుతాడా? లేదా? అన్నదానిపై సందిగ్ధత నెలకొంది.



## మెరిసిన 'గురుకుల' బాక్సర్లు

హైదరాబాద్: రాష్ట్రస్థాయి 7వ యూత్ మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యూకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) విద్యార్థులు అదరగొట్టారు. హైదరాబాద్‌లోని లాలగూడ వేదికగా ఆదివారం జరిగిన పోటీలలోని వేర్వేరు విభాగాలలో గురుకుల పాఠశాలలకు చెందిన నలుగురు బాక్సర్లు స్వర్ణ పతకాలు నెగ్గారు. శ్రీలేఖ (48-50 కిలోలు), నిఖిత (45-48 కిలోలు), అశ్విక్ (75-80 కిలోలు), విష్ణువర్ధన్ (60-65 కిలోలు) పసిడి పతకాలు గెలిచిన వారిలో ఉన్నారు.

## స్వియాటెక్‌దే మ్యాడ్రిడ్ ఓపెన్



మ్యాడ్రిడ్: మహిళల టెన్నిస్‌లో ప్రపంచ నెంబర్ వన్ ఇగా స్వియాటెక్ (పోలండ్) ఈ ఏడాది మ్యాడ్రిడ్ ఓపెన్ మహిళల టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ తుదిపోరులో స్వియాటెక్.. 7-5, 4-6, 7-6 (9/7) తేడాతో రెండో సీడ్ అరీనా సబలెంకను ఓడించింది. 3 గంటల 11 నిమిషాల పాటు హోరాహోరిగా సాగిన ఈ పోరులో స్వియాటెక్‌నే విజయం వరించింది.

## థామస్, ఉబర్ కప్ విజేత చైనా

- ఫైనల్‌లో ఇండోనేషియా ఓటమి

చెంగ్డు: ప్రతిష్ఠాత్మక థామస్ (పురుషుల), ఉబర్ (మహిళల) కప్ విజేతగా చైనా నిలిచింది. చెంగ్డు (చైనా) వేదికగా ఆదివారం ముగిసిన థామస్ కప్ ఫైనల్స్‌లో చైనా.. 3-1 తేడాతో ఇండోనేషియాను ఓడించి టైటిల్ సొంతం చేసుకుంది. గతేడాది భారత్ చేతి లో ఓడి రన్నరప్‌గా నిలిచిన ఇండోనేషియా ఈసారీ రెండోస్థానంతోనే సరిపెట్టుకుంది. ఉబర్ కప్ తుదిపోరులో చైనా 3-0తో ఏకపక్ష విజయం సాధించింది.

# కోల్‌కతా టాప్ షో

లక్నోపై ఘనవిజయం

దంచికొట్టిన నరైన్

రాణించిన చక్రవర్తి, హర్షిత్

**ఐపీఎల్-17లో అంచనాలకు మించి రాణిస్తున్న మాజీ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) మరోసారి సమిష్టి ఆటతో ఘనవిజయాన్ని నమోదుచేసింది. సునీల్ నరైన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. సిక్సర్ల సునామీతో లక్నో బౌలర్లపై విరుచుకుపడి ఆ తర్వాత ప్రత్యర్థి బ్యాటర్లకు కళ్లెం వేశాడు. హర్షిత్ రాణా, ఆండ్రీ రస్సెల్, వరుణ్ చక్రవర్తి కట్టడిచేయడంతో లక్నోకు మరో పరాభవం ఎదురైంది. 8వ విజయంతో 16 పాయింట్లు సాధించిన కోల్‌కతా ప్లేఆఫ్స్ బెర్తును ఖాయం చేసుకోవడంతో పాటు పాయింట్ల పట్టికలో రాజస్థాన్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానంలో నిలిచింది.**

లక్నో: కోల్‌కతా నైట్ రైడర్స్ మరోసారి సమిష్టి ప్రదర్శనతో రాణించి ఐపీఎల్-17 ప్లేఆఫ్స్ బెర్తును ఖాయం చేసుకుంది. లక్నో వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌ను 98 పరుగుల తేడాతో చిత్తుచేసింది. ఈ సీజన్‌లో ఓపెనర్‌గా వస్తూ శివాలెత్తుతున్న సునీల్ నరైన్ (39 బంతుల్లో 81, 6 ఫోర్లు, 7 సిక్సర్లు) వీరవిహారానికి తోడు మిగిలిన బ్యాటర్లంతా తలా ఓ చేయి వేయడంతో మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో లక్నో ఆరంభం నుంచే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి 16.1 ఓవర్లలో 137 పరుగులకే ఆలౌట్ అయింది. స్టోయినిస్ (21 బంతుల్లో 36, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) ఫర్వాలేదనిపించాడు. హర్షిత్ (3/24), చక్రవర్తి (3/30), రస్సెల్ (2/17) లక్నోను కట్టడిచేశారు. బ్యాటింగ్‌లో దుమ్మురేపిన 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' నరైన్.. బౌలింగ్‌లో 4 ఓవర్లు వేసి 22 పరుగులే ఇచ్చి ఒక వికెట్ తీశాడు.

**నరైన్ బాదుడే బాదుడు..**

కేకేఆర్ ఓపెనర్ ఫిల్ సాల్ట్ (14 బంతుల్లో 32, 5 ఫోర్లు, 1 సిక్స్) తొలి ఓవర్లోనే రెండు ఫోర్లతో బాదుడుకు తెరతీశాడు. నవీన్ ఉల్ హక్ మూడో ఓవర్లో రెండు బౌండరీలతో హిట్టింగ్‌కు దిగిన నరైన్.. మోహ్సిన్ మూడో ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు, ఓ సిక్సర్‌తో రెచ్చిపోయాడు. సాల్ట్ ఔట్ అయినా నరైన్ విధ్వంసం ఆగలేదు. 27 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసిన అతడు స్టోయినిస్ 11వ ఓవర్లో మూడు సిక్సర్లతో కేకేఆర్ స్కోరు వేగాన్ని పెంచాడు. అంగ్‌క్రిష్ రఘువంశీ (32)తో కలిసి రెండో వికెట్‌కు 79 పరుగులు జోడించాడు. ధాటిగా ఆడే క్రమంలో అతడు ఔట్ అయినా ఆఖర్లో శ్రేయస్ (23), రమణ్‌దీప్ సింగ్ (6 బంతుల్లో 25 నాటౌట్, 1 ఫోర్, 3 సిక్సర్లు) దంచడంతో కోల్‌కతా మరోసారి భారీ స్కోరుచేసింది.

**లక్నో టపటప..**

కొండంత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రెండో ఓవర్లోనే ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (9) వికెట్‌ను కోల్పోయిన లక్నోను కెఎల్ రాహుల్ (25), మార్కస్ స్టోయినిస్ నిలబెట్టే యత్నం చేశారు. కానీ హర్షిత్ రాణా 8వ ఓవర్లో రాహుల్ ఔట్ కాగా స్టోయినిస్‌ను రస్సెల్ పెవిలియన్ చేర్చాడు. దీపక్ హుడా (5), నికోలస్ పూరన్ (10), బదోని (15), టర్నర్ (16), కృనాల్ (5) విఫలమయ్యారు.



నరైన్ (81, 1/22)

**సంక్షిప్త స్కోర్లు**

కోల్‌కతా: 20 ఓవర్లలో 235/6 (నరైన్ 81, సాల్ట్ 32, నవీన్ 3/49, యుధ్‌వీర్ 1/24). లక్నో: 16.1 ఓవర్లలో 137 (స్టోయినిస్ 36, రాహుల్ 25, హర్షిత్ 3/24, చక్రవర్తి 3/30)

**పాయింట్ల పట్టిక**

| జ | ఆ | గె | ఓ | ర | పా |
|---|---|---|---|---|---|
| కోల్‌కతా | 11 | 8 | 3 | 1.45 | 16 |
| రాజస్థాన్ | 10 | 8 | 2 | 0.62 | 16 |
| చెన్నై | 11 | 6 | 5 | 0.70 | 12 |
| హైదరాబాద్ | 10 | 6 | 4 | 0.07 | 12 |
| లక్నో | 11 | 6 | 5 | -0.37 | 12 |
| ఢిల్లీ | 11 | 5 | 6 | -0.44 | 10 |
| బెంగళూరు | 11 | 4 | 7 | -0.04 | 8 |
| పంజాబ్ | 10 | 4 | 6 | -0.06 | 8 |
| గుజరాత్ | 11 | 4 | 7 | -1.32 | 8 |
| ముంబై | 11 | 3 | 8 | -0.35 | 6 |

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

## మహిళల టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

- ఒకే గ్రూపులో భారత్, ఆసీస్, పాకిస్థాన్




ఢాకా: బంగ్లాదేశ్ ఆతిథ్యమివ్వనున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్-2024 షెడ్యూల్, గ్రూప్ ఫిక్చర్స్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆదివారం విడుదల చేసింది. అక్టోబర్ 3 నుంచి 20 దాకా బంగ్లాదేశ్‌లోని షేర్ ఎ బంగ్లా, సిల్హెట్ వేదికలుగా మ్యాచ్‌లు జరుగున్నాయి. పది జట్లు తలపడనున్న ఈ మెగా టోర్నీలో జట్లను రెండు గ్రూపులుగా విభజించగా గ్రూప్-ఏలో భారత్, ఆస్ట్రేలియా, పాకిస్థాన్, న్యూజిలాండ్, క్వాలిఫయర్ 1 ఉండగా ఆతిథ్య బంగ్లాదేశ్, ఇంగ్లండ్, సౌతాఫ్రికా, వెస్టిండీస్, క్వాలిఫయర్ 2 గ్రూప్-బి లో ఉన్నాయి. రెండు గ్రూపుల నుంచి టాప్-2 జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. అక్టోబర్ 20న ఫైనల్ జరగాల్సి ఉంది. అక్టోబర్ 4న కివీస్ మ్యాచ్‌తో ప్రపంచకప్ వేట ఆరంభించనున్న భారత్.. 6న చిరకాల ప్రత్యర్థి పాక్‌తో తలపడనుంది.



# పరపతి పెంపునకు పంచ సూత్రాలు

**1** వచ్చే ఆదాయాన్ని తెలివిగా వాడుకోవాలంటే బడ్జెట్ తప్పనిసరి. కాబట్టి ప్రతి ఒక్కరూ తమ ఖర్చులపై అవగాహనతో ఉండాలి. అప్పుడే చక్కని బడ్జెట్‌తో ఆర్థిక సవాళ్లను అధిగమించగలం. ఇందుకోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ వనరులను, వివిధ యాప్స్‌నూ వాడుకోవచ్చు.

**2** క్రెడిట్ స్కోర్ బాగుంటే అత్యుత్తమ క్రెడిట్ కార్డులను, తక్కువ వడ్డీకే రుణాలను పొందవచ్చు. ఆర్థిక క్రమశిక్షణతో ముందుకెళ్తే ఆకర్షణీయమైన క్రెడిట్ స్కోర్ మన సొంతం కాగలదు. అవసరానికి మించిన రుణ భారంతో తిప్పలు తప్పవు. అనవసరపు హామీల జోలికి వెళ్లవద్దు.

**3** అత్యవసర నిధి తప్పక ఉండాలి. ఏ అవసరం ఎప్పుడు వస్తుందో.. ఏ కష్టం ఏ వైపు నుంచి పుట్టుకొస్తుందో ఊహించలేం. కనుక ముందు జాగ్రత్త అన్నది ముఖ్యం. అందుకే కనీసం మీ ఆరు నెలల అవసరాలు తీరేంత నగదు నిల్వాల్ని ఉంచుకోండి. దీనివల్ల ఆపత్కాలంలో అధిక వడ్డీ రుణాలకు దూరంగా ఉండవచ్చు.

**4** మీ ఆర్థిక లక్ష్యాల సాధనకు సేవింగ్స్ ఎంతో కలిసొస్తాయి. ప్రధానంగా దీర్ఘకాలిక పొదుపుతో ఎక్కువ ప్రయోజనాలను అందుకోవచ్చు. దీర్ఘకాల సంపద సృష్టికి సిప్‌ల ద్వారా స్మాల్ సేవింగ్స్ ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. చిన్న వయసు నుంచే పొదుపు.. పెద్ద లాభాల్ని తెచ్చిపెట్టగలదు.

**5** ఏ రకమైన చెల్లింపులనైనా వాయిదా వేయకుండా సమయానుసారం చెల్లించండి. క్రెడిట్ కార్డ్ బిల్లులను అశ్రద్ధ చేయవద్దు. దీనివల్ల మీ క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుంది. స్థోమతకు మించిన ఆర్థిక భారాన్ని మోయవద్దు. అలాగే ఆరోగ్య బీమా, జీవిత బీమాలకు ప్రాధాన్యం ఇవ్వండి. మనకు, మన కుటుంబ సభ్యులకు బీమానే కొండంత ధీమా.




**బంగారం** కొనుగోళ్లకు అక్షయ తృతీయ ఎంతో ప్రత్యేకం. ఈ ఏడాదికిగాను ఈ నెల 10 (శుక్రవారం)న వస్తున్నది. ఈరోజున పసిడి కొనుగోళ్లు శుభప్రదమని భారతీయుల నమ్మకం. అందుకే దేశవ్యాప్తంగా ఉన్న చిన్న, పెద్ద నగల వ్యాపారులు సైతం కొనుగోలుదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు. మార్కెట్‌లో ఆఫర్లు, గిఫ్టులు, తగ్గింపులు అంటూ సందడే సందడి. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా కొనుగోలుదారుల ఆలోచనా తీరులోనూ మార్పులు వచ్చాయి. ఈ క్రమంలోనే భౌతిక బంగారం నుంచి డిజిటల్ గోల్డ్ వైపు కస్టమర్లు అడుగులు వేస్తున్నారు. గత కొన్నేండ్లుగా అక్షయ తృతీయకు ఈ డిజిటల్ గోల్డ్‌ను కొనేవారు క్రమేణా పెరుగుతూ వస్తుండటం కూడా గమనార్హం. బంగారంతో పోల్చితే డిజిటల్ గోల్డ్‌కున్న అనుకూలతల్ని పరిశీలిస్తే..




# డిజిటల్ గోల్డ్ కొంటారా?

**డిజిటల్ గోల్డ్ అంటే?**

డిజిటల్ గోల్డ్‌కు భౌతిక రూపం అంటూ ఏమీ ఉండదు. బ్లాక్‌చైన్ టెక్నాలజీ ఆధారంగా లావాదేవీలు నడుస్తాయి. అయితే సంప్రదాయ మార్కెట్‌లోని బంగారం ధరలు.. డిజిటల్ గోల్డ్ విలువను ప్రభావితం చేస్తాయి. గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్, గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్స్, సావరిన్ గోల్డ్ బాండ్లు (ఎస్‌జీబీ) డిజిటల్ గోల్డ్‌గానే పరిగణించవచ్చు.

**ఎలా కొనాలి?**

ఎంఎంటీసీ-పీఏఎంపీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఇన్వెస్టర్లు డిజిటల్ గోల్డ్‌ను కొనవచ్చు. మీరు కొన్న డిజిటల్ గోల్డ్‌కు సమాన విలువ కలిగిన భౌతిక బంగారాన్ని తమ సొంత వాల్ట్స్‌లో ఇది నిల్వ చేస్తుంది. భారత ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎంటీసీ, స్విట్జర్లాండ్‌కు చెందిన బులియన్ బ్రాండ్ పీఏఎంపీ ఎస్ఏ జాయింట్ వెంచరే ఈ ఎంఎంటీసీ-పీఏఎంపీ. దీని భాగస్వామ్యంతో గూగుల్ పే, పేటీఎం, ఫోన్‌పే వంటి ఫిన్‌టెక్ కంపెనీలు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి బ్యాంకులు, మోతీలాల్ ఓస్వాల్, ఏంజెల్ బ్రోకింగ్ వంటి బ్రోకరేజీ సంస్థలు డిజిటల్ గోల్డ్ క్రయవిక్రయ లావాదేవీల్లో పాల్గొంటున్నాయి. స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా కూడా డిజిటల్ గోల్డ్‌ను కొనవచ్చు. కొనుగోలుదారులు ఎప్పుడంటే అప్పుడు వీటిని తిరిగి అమ్ముకుని సొమ్ము చేసుకోవచ్చు.

- **సంప్రదాయ బంగారానికి (నగలు, నాణేలు, కడ్డీలు) ఉన్న దొంగతనం బెడద డిజిటల్ గోల్డ్‌కు ఉండదు.**
- **చిన్నచిన్న మదుపరులకూ అనువైనది.**
- **నగదులోకి సులభంగానే మార్చుకోవచ్చు.**
- **ఎప్పుడైనా ఆన్‌లైన్‌లో అమ్ముకోవడానికి, కొనడానికి వీలుంటుంది.**
- **సురక్షితమైన పెట్టుబడి. ధరల్లో, నాణ్యతలో అత్యంత పారదర్శకత ఉంటుంది.**

**చివరగా..**

ప్రభుత్వ నియంత్రణ అంతగా లేకపోవడంతో డిజిటల్ గోల్డ్ క్రయవిక్రయాలు, నిల్వపై ఫీజుల భారాన్ని ఇన్వెస్టర్లు మోయాల్సి వస్తున్నది. పైగా ప్రతీ ఆరు నెలలకోసారి అకౌంట్ యాక్టివిటీ ఉండాల్సిందే.

# పోస్టాఫీస్ స్కీములు భళా



**రిస్క్ తక్కువ**-రాబడి ఎక్కువ ఇది.. పోస్టాఫీస్ పథకాల్లో ఉన్న సౌలభ్యం. మీ భవిష్యత్తు కోసం మీ సంపద వృద్ధి చెందేలా పోస్టాఫీస్ రకరకాల పెట్టుబడి మార్గాలను అందిస్తున్నది. పైగా వీటిలో చాలావరకు ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపుల్నీ ఇస్తున్నాయి. ప్రస్తుతం దాదాపు 9 రకాల సేవింగ్స్ స్కీములు పోస్టాఫీస్ ద్వారా అందుబాటులో ఉన్నాయి. ప్రతీ 3 నెలలకోసారి ఈ స్కీముల వడ్డీరేట్లను కేంద్ర ప్రభుత్వం సవరిస్తుంది. ఆయా పథకాలను ఒక్కసారి పరిశీలిస్తే..

**సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం**

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం (ఎస్‌సీఎస్ఎస్)లో వడ్డీరేటు అత్యధికంగా 8.60 శాతం. 60 ఏండ్లు దాటిన వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఉన్న ఈ పథకంలో కనీస డిపాజిట్ రూ.1,000. గరిష్ఠం రూ.15 లక్షలు. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులూ ఉంటాయి.

**సుకన్య సమృద్ధి యోజన**

ఆడపిల్లల కోసం ఉద్దేశించిన ఈ సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై) స్కీంలో మదుపు చేస్తే 8.40 శాతం వడ్డీరేటును పొందవచ్చు. నెలకు రూ.250 చొప్పున కూడా డిపాజిట్ చేయవచ్చు. సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు.

**పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్**

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)లో వడ్డీరేటు 7.90 శాతం. ఈ స్కీం కింద ఏటా రూ.500 నుంచి రూ.1.5 లక్షల వరకు ఎంతైనా మదుపు చేసుకోవచ్చు. సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాలూ అందుతాయి.




**నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ స్కీం**

ఐదేండ్ల కాల పరిమితి కలిగిన నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ) పథకంలో 8వ విడుత నడుస్తున్నది. ఇందులో వడ్డీరేటు 7.70 శాతం. కనీస పెట్టుబడి రూ.1,000. గరిష్ఠ పరిమితి అంటూ లేదు. ఎంతైనా పెట్టుబడులుగా పెట్టుకోవచ్చు.

**టర్మ్ డిపాజిట్ స్కీం**

ఇందులో వడ్డీరేటు 6.90 శాతం నుంచి 7.70 శాతం వరకు ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.1,000. గరిష్ఠంగా ఎంతైనా మదుపు చేసుకోవచ్చు. సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులు వర్తిస్తాయి.

**పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కం స్కీం**

పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కం (పీఎంఐ) పథకంలో వడ్డీరేటు 7.60 శాతం. కనీస పెట్టుబడి రూ.1,500. సింగిల్ అకౌంట్లలో గరిష్ఠ పెట్టుబడికున్న పరిమితి రూ.4.5 లక్షలు. జాయింట్ అకౌంట్లలో రూ.9 లక్షలు.

**కిసాన్ వికాస్ పత్ర**

పోస్టాఫీస్ అందిస్తున్న అత్యంత పాత పథకాల్లో ఈ కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ) ఒకటి. ఇందులో వడ్డీరేటు 7.60 శాతం. కనీస పెట్టుబడి రూ.1,000.

**రికరింగ్ డిపాజిట్ స్కీం**

ఈ స్కీంలో వడ్డీరేటు 7.20 శాతం. కనీస పెట్టుబడి రూ.100. గరిష్ఠంగా ఎంతైనా డిపాజిట్ చేసుకోవచ్చు.

**సేవింగ్స్ అకౌంట్**

బ్యాంకుల తరహాలో అందుబాటులో ఉన్న సేవింగ్స్ అకౌంట్ ఇది. పోస్టాఫీస్ పొదుపు ఖాతాదారులు.. తమ డిపాజిట్లపై 4 శాతం వడ్డీరేటును అందుకోవచ్చు. ఖాతాలో కనీసం రూ.500 ఉంచాల్సిందే. గరిష్ఠంగా ఎంతైనా వేసుకోవచ్చు.

# ఒడిదొడుకుల్లోనే పయనం..

మార్కెట్ పల్స్



**గత** వారం దేశీయ స్టాక్ మార్కెట్లు పడుతూలేస్తూ సాగాయి. ఆఖరి రోజున భారీ నష్టాల కారణంగా స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. ఓవరాల్‌గా మదుపరులు.. అమ్మకాలు, కొనుగోళ్ల మధ్య ఊగిసలాడారు. ఫలితంగానే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 147.99 పాయింట్లు పెరిగి 73,878.15 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 55.90 పాయింట్లు అందుకొని 22,475.85 దగ్గర నిలిచింది. ఈ క్రమంలో ఈ వారం కూడా ఇన్వెస్టర్ల కదలికలు ఏదో ఒక వైపునకే ఉండకపోవచ్చన్న అంచనాలున్నాయి. దీంతో లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేసినా.. కొంతమేర కొనుగోళ్లకూ దిగవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే మెజారిటీ విశ్లేషకులు.. సూచీలు అమ్మకాల ఒత్తిడికి లోను కావచ్చన్న సంకేతాలనే ఇస్తున్నారు. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, ఆయా విదేశీ పరిణామాలు సైతం ఈ వారం మార్కెట్ తీరును నిర్దేశించనున్నాయి. నిఫ్టీకి 22,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,000 పాయింట్లు మద్దతు స్థాయిగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 22,600-22,800 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.